చేరదీసి.. కాలేజీ ఫీజు చెల్లించి..

- పేద విద్యార్థులను ఆదుకున్న ఎంపీ వద్దిరాజు
- తల్లిదండ్రులను కోల్పోయిన అన్నదమ్ములకు ఉన్నత విద్య సాయం

విద్యార్థులను ఆశీర్వదిస్తున్న ఎంపీ వద్దిరాజు రవిచంద్ర

ఖమ్మం, మే 27 : తల్లిదండ్రులను కోల్పోయి దిక్కుతోచని స్థితిలో ఉన్న ఇద్దరు విద్యార్థులను చేరదీసి వారి ఇంటర్మీడియట్ విద్యకు అవసరమైన డబ్బులు చెల్లించి వారి బంగారు భవిష్యత్తుకు బాటలు వేశారు రాజ్యసభ సభ్యుడు వద్దిరాజు రవిచంద్ర. వివరాల్లోకెళ్తే.. రఘునాథపాలెం మండలం ఈర్లపూడి గ్రామానికి చెందిన మొగిలిశెట్టి శ్రీనివాసరావు-విజయలక్ష్మి దంపతులకు ఇద్దరు కుమారులు శశి అభినయ్, పవన్ విలాస్ ఉన్నారు. శ్రీనివాసరావు లారీడ్రైవర్‌గా పనిచేస్తూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. ఇద్దరి పిల్లలతో కుటుంబం హాయిగా గడిచిపోతున్న సమయంలో అంతుచిక్కని వ్యాధి దంపతులిద్దరినీ కబళించింది. కొన్నేళ్ల కిందట శ్రీనివాసరావు చనిపోగా ఇటీవల విజయలక్ష్మి మృతిచెందింది. రెక్కాడితే గానీ డొక్కాడని ఆ కుటుంబంలో చిన్నారులిద్దరూ దిక్కులేని వారయ్యారు. అమ్మమ్మ-తాతయ్య దగ్గర ఉంటున్న అన్నదమ్ములిద్దరూ చదువుకునేందుకు డబ్బులు లేకపోవడంతో ఏదైనా షాపులో పనిచేసేందుకు సిద్ధమయ్యారు. విషయం తెలుసుకున్న జర్నలిస్టు ఆకుతోట ఆదినారాయణ విద్యార్థుల సమస్యను ఎంపీ వద్దిరాజుకు వివరించారు. వెంటనే స్పందించిన వద్దిరాజు వారు ఇంటర్మీడియట్ విద్యను పూర్తిచేసేందుకు అండగా నిలిచారు. ఒకొక్కరికి రూ.1.60 లక్షల చొప్పున ఇద్దరికీ రూ.3.20 లక్షల ఫీజు చెల్లించి ఖమ్మంలోని రెజొనెన్స్ కాలేజీలో చదివించారు. ప్రస్తుతం పెద్దవాడు శశి అభినయ్ బీటెక్ మూడో సంవత్సరం చదువుతుండగా, చిన్నవాడు పవన్ విలాస్ ఇంటర్ సెకెండియర్ పూర్తిచేశాడు. ఇద్దరు విద్యార్థులకు కూడా ఒకరు 956 మార్కులు, మరొకరు 910 మార్కులతో ఇంటర్‌లో అత్యుత్తమ ఫలితాలు సాధించారు. ఈ మేరకు ఆదివారం విద్యార్థుల కాలేజీ ఫీజును ఎంపీ చెల్లించగా వారిద్దరూ వద్దిరాజును కలిసి ఆశీర్వాదం తీసుకున్నారు. ఎంపీకి విద్యార్థులిద్దరూ కృతజ్ఞతలు తెలిపారు.

కేంద్రాలను సందర్శించిన భద్రాద్రి ఎస్పీ

కొత్తగూడెంలోని పోలింగ్ కేంద్రాలను సందర్శిస్తున్న ఎస్పీ రోహిత్ రాజు

కొత్తగూడెం క్రైం, మే 27 : కొత్తగూడెం పట్టణంలోని రామచంద్ర, సింగరేణి పాఠశాలల్లో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రాలను భద్రాద్రి జిల్లా ఎస్పీ బిరుదరాజు రోహిత్‌రాజు సోమవారం సందర్శించారు. కేంద్రాల వద్ద ఓటర్లకు కల్పించిన సౌకర్యాలతో పాటు బందోబస్తు ఏర్పాట్లను ఆయన పరిశీలించారు. విధులు నిర్వర్తిస్తున్న సిబ్బందికి పలు సూచనలు చేశారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలకు తావులేకుండా పటిష్ట బందోబస్తు మధ్య పోలింగ్ ప్రశాంతంగా జరిగినట్లు ఆయన ఈ సందర్భంగా తెలిపారు. జిల్లాలోని 59 పోలింగ్ కేంద్రాల్లో మొత్తం 400 మంది పోలీస్ సిబ్బంది బందోబస్తు విధులు నిర్వర్తించారు. మరో 150 మంది స్పెషల్ పార్టీ సిబ్బంది మావోయిస్టు ప్రభావిత ప్రాంతాల్లో ఎలాంటి అవాంతరాలు కలుగకుండా విధులు నిర్వర్తించారు. ఎస్పీ వెంట కొత్తగూడెం డీఎస్పీ షేక్ అబ్దుల్ రెహమాన్, వన్ టౌన్ ఇన్‌స్పెక్టర్ ఎం.కరుణాకర్, త్రీ టౌన్ ఇన్‌స్పెక్టర్ కాగితోజు శివప్రసాద్, ఎస్బీ ఇన్‌స్పెక్టర్ మడిపెల్లి నాగరాజు, పీఆర్‌వో దాములూరి శ్రీనివాస్ ఉన్నారు.

అధికార పార్టీ ప్రలోభాల పర్వం

- పేర్ల నమోదు పుకార్లతో పట్టభద్రులకు ఎర వేసే ప్రయత్నం
- ఉదయం బైపాస్ రోడ్డులో నజరానాల పంపిణీ ప్రచారం
- గ్రాడ్యుయేట్ల రాకతో గేట్లు మూసివేసిన 'హస్తం' నాయకులు
- మధ్యాహ్నం సాయిగణేశ్‌నగర్‌లో నగదు పంపిణీ వార్తలు
- వందలాదిగా కదిలివచ్చిన పట్టభద్రులు.. నేతల నిలదీత..

ప్రైవేట్ ఫంక్షన్ హాల్ ఎదుట నిరీక్షిస్తున్న పట్టభద్రులు

ఓ అధికార పార్టీ నాయకుడి క్యాంపు కార్యాలయంలో పట్టభద్రుల పడిగాపులు

ఖమ్మం రూరల్, మే 27: ఎమ్మెల్సీ ఎన్నికల సందర్భంగా పట్టభద్రులకు ఎర వేసేందుకు, ఆ ఎరను ఆశగా చూపి వారితో ఓట్లు వేయించుకునేందుకు అధికార పార్టీ నేతలు అనేక ప్రలోభాలకు పూనుకున్నారు. చాలా మంది పట్టభద్రులు ఈ ప్రలోభాల ప్రచారాన్ని నిజమేనని నమ్మారు. ఖమ్మం రూరల్ మండలంలో సోమవారం ఉదయం 8 గంటలకు పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్ ప్రారంభమైంది. ఆ కొద్దిసేపటికే బైపాస్‌రోడ్డులోని ఓ ప్రైవేట్ ఫంక్షన్ హాల్లో అధికార పార్టీ నాయకులు ఓటర్లకు నజరానాలు పంచుతున్నారనే వార్తలు ఒక్కసారిగా గుప్పుమన్నాయి. దీంతో ఇంకా పోలింగ్ కేంద్రాలకు రాని ఓటర్లు, అప్పటికే ఓటేసేందుకు వచ్చిన మరికొందరు ఓటర్లు హుటాహుటిన ఆ ఫంక్షన్ హాల్ వైపు పరుగులు తీశారు. అంతమంది వస్తున్నారని గమనించిన అక్కడి నాయకులు.. ఫంక్షన్ హాల్ ప్రధాన గేటును మూసివేశారు. దీంతో అక్కడికి చేరుకున్న పట్టభద్రులందరూ చాలాసేపటి వరకూ గేటు బయటనే వేచి చూశారు. అయినా గేటు తెరుచుకోకపోవడంతో వెనుదిరిగారు. తరువాత మధ్యాహ్నం సమయంలో సాయిగణేశ్‌నగర్‌లో హస్తం పార్టీకి చెందిన ఓ ప్రధాన నాయకుడి క్యాంపు కార్యాలయంలో నగదు పంపిణీ చేస్తున్నారనే వార్తలు వచ్చాయి. దీంతో మళ్లీ వందలాది మంది గ్రాడ్యుయేట్లు మరోసారి అక్కడికి చేరుకున్నారు. డబ్బులిస్తున్నారని పిలిపించి ఇవ్వకపోవడంపై అధికార పార్టీ నాయకులను నిలదీశారు. దీంతో స్పందించిన హస్తం నేతలు.. ఓటర్ల పేర్లు నమోదు చేసుకుంటున్నామని, ఓటు వేసి వచ్చాక డబ్బులు ఇస్తామని చెప్పారు. దీంతో పట్టభద్రులు మళ్లీ నిరాశ చెందారు. మరోవైపు పోలింగ్ ముగిసే సమయం దగ్గర పడుతుండడంతో చేసేదేమీ లేక పేర్లు నమోదు చేయించుకొని బతుకు జీవుడా అంటూ పోలింగ్ బూత్‌ల బాటపట్టారు. కాగా.. ఖరీదైన కార్లు, బైకులు వేసుకొని వచ్చిన పట్టభద్రులు.. విద్యావంతులు అయి ఉండి కూడా తాయిలాల కోసం ఆరాటపడుతున్నారంటూ అక్కడి సాధారణ ప్రజలు ముచ్చటించుకున్న సంభాషణలు వినిపించాయి.

రూ.1.23 కోట్ల విలువైన గంజాయి పట్టివేత

- నలుగురిపై కేసు నమోదు

త్రీ టౌన్ పోలీసులు స్వాధీనం చేసుకున్న గంజాయి, అదుపులో ఉన్న నిందితులు

కొత్తగూడెం క్రైం, మే 27 : డీసీఎం వ్యాన్‌లో తరలిస్తున్న గంజాయిని కొత్తగూడెం త్రీ టౌన్ పోలీసులు సోమవారం పట్టుకున్నారు. వివరాలిలా ఉన్నాయి. తమకు అందిన విశ్వసనీయ సమాచారం మేరకు కొత్తగూడెం త్రీ టౌన్ ఇన్‌స్పెక్టర్ కాగితోజు శివప్రసాద్ నేతృత్వంలో ఎస్సై బి.పురుషోత్తం ఓల్డ్ డిపో ఏరియా వద్ద వాహనాల తనిఖీ చేపట్టారు. ఈ క్రమంలో మధ్యాహ్నం 2 గంటల సమయంలో ఇద్దరు వ్యక్తులు అశోక్ లే ల్యాండ్ డీసీఎం వాహనంపై వెళుతూ అనుమానాస్పదంగా కనిపించారు. దీంతో వాహనాన్ని అడ్డుకునే ప్రయత్నంలో వారు తప్పించుకునే ప్రయత్నం చేయగా.. పోలీసులు వారిని సినిమా తరహాలో చేజ్ చేసి పట్టుకున్నారు. సదరు వ్యక్తులు ఎవరికీ అనుమానం రాకుండా డీసీఎం క్యాబిన్ వెనుక భాగానికి సమాంతరంగా అరను తయారు చేసి అందులో గంజాయి ప్యాకెట్లను దాచగా.. పోలీసుల తనిఖీల్లో అవి బయటపడ్డాయి. వెంటనే నిందితులను అదుపులోకి తీసుకుని వారి వద్ద నుంచి మొత్తం రూ.1.23 కోట్ల విలువ చేసే 492 ప్యాకెట్ల గంజాయిని స్వాధీనం చేసుకున్నట్లు త్రీ టౌన్ ఇన్‌స్పెక్టర్ శివప్రసాద్ వెల్లడించారు. నిందితులు మహారాష్ట్రలోని అహ్మద్ జిల్లా పుణేకు చెందిన శుభమ్ శరత్, అంజత్ అబ్దుల్‌గా పోలీసులు గుర్తించారు. శరత్ ఆటో డ్రైవర్‌గా జీవనం సాగిస్తుండగా.. అంజత్ లారీ డ్రైవర్‌గా పని చేస్తున్నాడు. వీరు ఈ గంజాయిని ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం సీలేరు వద్ద పెద్దగొండి గ్రామానికి చెందిన రాజు అనే వ్యక్తి వద్ద కొనుగోలు చేసి మహారాష్ట్ర రాష్ట్రంలోని షోలాపూర్‌కు చెందిన యోగేశ్ వద్దకు తరలిస్తుండగా పట్టుబడినట్లు సీఐ శివప్రసాద్ వెల్లడించారు. గంజాయిని విక్రయించిన రాజు, కొనుగోలు చేసేందుకు యత్నించిన యోగేశ్‌లతోపాటు రవాణాకు సహకరించిన శరత్, అంజత్‌లపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఆయన వెల్లడించారు. గంజాయి రవాణాదారులను చాకచక్యంగా వ్యవహరించి అదుపులోకి తీసుకున్న త్రీటౌన్ ఎస్సై పురుషోత్తం, సిబ్బంది, టాస్క్‌ఫోర్స్ పోలీసులను ఎస్పీ రోహిత్ రాజు ప్రత్యేకంగా అభినందించారు.

టేకులపల్లి కేంద్రాన్ని సందర్శించిన భద్రాద్రి కలెక్టర్

టేకులపల్లిలోని పోలింగ్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్ ప్రియాంక ఆల

భద్రాద్రి కొత్తగూడెం, మే 27 (నమస్తే తెలంగాణ)/టేకులపల్లి : టేకులపల్లి ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రాన్ని భద్రాద్రి కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి ప్రియాంక ఆల సోమవారం సందర్శించారు. కేంద్రంలో ఓటర్లకు కల్పించిన సౌకర్యాలను అడిగి తెలుసుకోవడంతోపాటు పోలింగ్ సరళిని ప్రత్యక్షంగా పరిశీలించారు. పోలింగ్ విధులు నిర్వహిస్తున్న సిబ్బందికి భోజనం, ఇతర సౌకర్యాలు అందుతున్నాయా.. లేదా.. అని అడిగి తెలుసుకున్నారు. ఎలాంటి పొరపాట్లకు తావు లేకుండా పోలింగ్ ప్రక్రియను విజయవంతం చేయాలని అధికారులకు సూచించారు. పోలింగ్ ముగిసిన తర్వాత బ్యాలెట్ పెట్టెల రవాణాకు పటిష్టమైన భద్రత కల్పించాలని ఆదేశించారు. ఆమె వెంట టేకులపల్లి తహసీల్దార్, సంబంధిత అధికారులు ఉన్నారు.

ఓటేసి వెళ్తుండగా... బైక్ డివైడర్‌ను ఢీకొట్టి వ్యక్తి మృతి

కుంజా రాజశేఖర్(ఫైల్)

బూర్గంపహాడ్, మే 27 : ఓ వ్యక్తి ఓటు వేసి వెళ్తుండగా బైక్ డివైడర్‌ను ఢీకొట్టింది. పడిపోయిన వ్యక్తి తలపై వెనుక నుంచి వస్తున్న లారీ టైరు ఎక్కడంతో దుర్మరణం పాలయ్యాడు. ఈ ఘటన భద్రాద్రి కొత్తగూడెం జిల్లా బూర్గంపహాడ్ మండలం మోరంపల్లిబంజర్‌లో సోమవారం రాత్రి చోటు చేసుకుంది. స్థానికుల కథనం ప్రకారం.. అశ్వాపురం మండలం పాములపల్లికి చెందిన కుంజా రాజశేఖర్(32) పాల్వంచలో ఉంటూ.. ఆదర్శ ప్రైవేటు పాఠశాలలో పీఈటీగా పనిచేస్తున్నాడు. సోమవారం పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఓటు వేసేందుకు బైక్‌పై పాములపల్లికి వచ్చి అశ్వారావుపేటలో ఓటు హక్కు వినియోగించుకున్నాడు. తర్వాత తిరిగి పాల్వంచకు వెళ్తుండగా మోరంపల్లిబంజర్ సమీపంలోకి రాగానే జడ్పీ పాఠశాల సమీపంలో ప్రధాన రహదారిపై ఉన్న డివైడర్‌ను ఢీకొట్టాడు. దీంతో బైక్‌పై నుంచి కిందపడిన రాజశేఖర్ తలపై అదే సమయంలో వెనుక నుంచి వస్తున్న లారీ టైరు ఎక్కడంతో అక్కడికక్కడే దుర్మరణం పాలయ్యాడు. ప్రమాద విషయం తెలుసుకున్న పోలీసులు ఘటనా ప్రదేశానికి చేరుకుని మృతదేహాన్ని బూర్గంపహాడ్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. కాగా.. రాజశేఖర్‌కు ఏడాది క్రితమే వివాహమైనట్లు కుటుంబ సభ్యులు తెలిపారు.

కారు ఢీకొని దంపతులు దుర్మరణం

ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఓటు వేయడానికి భార్యను బైక్‌పై తీసుకొస్తుండగా ఘటన

మృతిచెందిన భార్యాభర్తలు కృష్ణ, జానకి(ఫైల్)

టేకులపల్లి, మే 27 : తన భార్య చేత ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఓటు వేయించడానికి ద్విచక్ర వాహనంపై తీసుకొస్తుండగా కారు ఢీకొనడంతో తీవ్ర గాయాలపాలైన భార్యాభర్తలు దుర్మరణం పాలయ్యారు. ఈ ఘటన భద్రాద్రి కొత్తగూడెం జిల్లా లక్ష్మీదేవిపల్లి మండలం లాల్‌తండా తండా సమీపంలో సోమవారం ఉదయం చోటు చేసుకుంది. టేకులపల్లి ఎస్సై సైదా రవూఫ్ తెలిపిన వివరాల ప్రకారం.. సంపత్‌నగర్ గ్రామానికి చెందిన పాయం కృష్ణ(40), జానకి(36) దంపతులు నాలుగు నెలల క్రితం ప్రైవేటు ఉద్యోగ రీత్యా సంపత్‌నగర్ నుంచి పాల్వంచ వెళ్లిపోయారు. కృష్ణ పాల్వంచలోని ఓ ప్రైవేట్ కళాశాలలో ఉద్యోగం చేస్తున్నాడు. ఈ క్రమంలో తన భార్య జానకి స్వగ్రామం టేకులపల్లి కావడంతో ఎమ్మెల్సీ ఓటు అక్కడ వేయించడానికి పాల్వంచ నుంచి ద్విచక్ర వాహనంపై తీసుకొస్తున్నాడు. లాల్‌తండా సమీపంలోకి రాగానే జనగామ నుంచి భద్రాచలం వెళ్తున్న కారు ఎదురుగా వచ్చి వీరి బైక్‌ను ఢీకొట్టింది. తీవ్ర గాయాలైన దంపతులను స్థానికులు కొత్తగూడెంలోని ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. మెరుగైన వైద్యం కోసం ఖమ్మం తరలించాలని వైద్యులు సూచించడంతో తీసుకెళ్తుండగా మార్గమధ్యలో ఇద్దరూ మృతిచెందారు. వీరికి ఒక పాప ఉంది. ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు. కాగా.. కృష్ణ, జానకి మృతదేహాలను ఇల్లెందు ఎమ్మెల్యే కోరం కనకయ్య సందర్శించి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు.

వాణిజ్య

సామ్‌సంగ్ సరికొత్త గెలాక్సీ ఫోన్లు

ప్రారంభ ధర రూ.26,999

న్యూఢిల్లీ, మే 27: సరికొత్త స్మార్ట్‌ఫోన్లను దేశీయ మార్కెట్లోకి విడుదల చేసింది సామ్‌సంగ్ సంస్థ. గెలాక్సీ సిరీస్‌లో భాగంగా విడుదల చేసిన ఎఫ్55 5జీ వ్యాగన్ లెదర్ డిజైన్, 6.7 ఇంచుల ఫుల్ హెచ్‌డీ+ సూపర్ అమోలెడ్ డిస్‌ప్లే, శక్తివంతమైన స్నాప్‌డ్రాగన్ ప్రాసెసర్‌తో ఈ మొబైల్‌ను తీర్చిదిద్దింది. 8జీబీ+128జీబీ మెమొరీ కలిగిన మాడల్ ధర రూ.26,999 కాగా, 8జీబీ+256 జీబీ మాడల్ రూ.29,999, అలాగే 12జీబీ+256 జీబీ మాడల్ రూ.32,999గా నిర్ణయించింది. హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్, యాక్సిస్ బ్యాంక్, ఐసీఐసీఐ బ్యాంక్ కార్డులపై కొనుగోలు చేసిన వారికి రూ.2 వేల వరకు ఇన్‌స్టంట్ డిస్కౌంట్ కల్పిస్తున్నది. 45 వాట్ల సూపర్-ఫాస్ట్ చార్జింగ్, ఆండ్రాయిడ్ అప్‌గ్రేడ్, 5000 ఎంఏహెచ్ బ్యాటరీ వంటి ఫీచర్స్ ఉన్నాయి. ఈ సందర్భంగా సామ్‌సంగ్ ఇండియా సీనియర్ వైస్ ప్రెసిడెంట్ రాజు పుల్లన్ మాట్లాడుతూ..దేశం కోసం దేశీయంగా తయారైన ఈ ఎఫ్55 5జీ స్మార్ట్‌ఫోన్ కస్టమర్ల అభిరుచులకు తగ్గట్టుగా, ముఖ్యంగా యువతను దృష్టిలో పెట్టుకొని డిజైన్ చేసినట్లు చెప్పారు.



4 నెలలు.. 1,762 కోట్లు

రకరకాల ట్రేడింగ్ స్కాముల్లో పెద్ద ఎత్తున మోసపోతున్న మదుపరులు

ఈ ఏడాది జనవరి-ఏప్రిల్‌లో సైబర్‌క్రైమ్‌లు

కేసులు	నేరం	నష్టం (రూ.కోట్లలో)
20,043	ట్రేడింగ్ కుంభకోణాలు	1,420
62,687	పెట్టుబడి స్కాములు	222
4,599	డిజిటల్ మోసాలు	120

- గత ఏడాది దేశవ్యాప్తంగా లక్షకుపైగా ఇన్వెస్ట్‌మెంట్ స్కామ్ కేసులు నమోదు
- రోజూ మోసాలపై 7వేలకుపైగా వస్తున్న ఫిర్యాదులు. ఈ ఏడాదిలో ఇప్పటిదాకా 7,40,957 కేసులు
- గత కొన్నేండ్లుగా పెరుగుతూపోతున్న డిజిటల్ మోసాలు. 2019లో 26,049గా ఉన్న కేసులు.. 2023లో 15,56,215కు చేరిక.

ముంబై, మే 27: అమాయకులే లక్ష్యంగా సైబర్ నేరగాళ్లు మోసాలకు తెగబడుతున్నారు. ఈ ఏడాది జనవరి నుంచి ఏప్రిల్ వరకు నమోదైన వివిధ సైబర్‌క్రైమ్ కేసుల్లో ఇన్వెస్టర్లు రూ.1,762 కోట్లు నష్టపోయినట్టు ఇండియన్ సైబర్‌క్రైమ్ కోఆర్డినేషన్ సెంటర్ (14సీ) వివరాలు చెప్తున్నాయి. ఆన్‌లైన్ ఇన్వెస్ట్‌మెంట్ మోసం, గేమింగ్ యాప్స్, అల్గరిథమ్ అక్రమాలు, చట్టవిరుద్ధమైన రుణ యాప్‌లు, ఓటీపీలను ఇతరులకు పంపడం వంటి వాటిల్లో బాధితులు ఎక్కువగా ఉన్నట్టు తేలింది. తాజాగా నవీ ముంబైలోని ఖర్ఘర్ టౌన్‌షిప్‌కు చెందిన ఓ 48 ఏండ్ల వ్యక్తి కూడా షేర్ ట్రేడింగ్ కుంభకోణంలో చిక్కుకుని రూ.1.07 కోట్లు మోసపోయాడు. ఈ కేసు దర్యాప్తు కొనసాగుతుండగా, పోలీసులు 15 మందిపై 420సహా వివిధ సెక్షన్ల కింద ఎఫ్ఐఆర్ నమోదు చేశారు. వీరిలో ఓ యాప్, వెబ్‌సైట్ ఓనర్లు కూడా ఉన్నారు. ఈ ఏడాది ఫిబ్రవరి 13 నుంచి మే 5 వరకు బాధితుడిని మోసగాళ్లు పలుమార్లు కలిశారని, షేర్ ట్రేడింగ్ నుంచి ఆకర్షణీయమైన లాభాలను ఇప్పిస్తామని నమ్మబలికారని నవీ ముంబై సైబర్ పోలీస్ సీనియర్ ఇన్‌స్పెక్టర్ గజానన్ కదమ్ తెలిపారు. ఈ క్రమంలోనే వివిధ బ్యాంక్ ఖాతాల్లో పెట్టుబడిగా 1,07,09,000 రూపాయలను డిపాజిట్ చేయించుకున్నారన్నారు. అయితే ఆ తర్వాత వారి నుంచి ఎలాంటి స్పందన లేదని, దీంతో మోసపోయానని గుర్తించిన బాధితుడు ఫిర్యాదు చేశాడని గజానన్ వివరించారు.

మోసపోతున్నాం ఇలా..

సైబర్ నేరగాళ్లు ఫలానా బ్యాంక్ లేదా దర్యాప్తు ఏజెన్సీల నుంచి ఫోన్ చేస్తున్నామని చెప్పి మోసాలకు పాల్పడుతున్నారు. సీబీఐ, ఎన్ఐఏ, ఈడీ, ఆర్బీఐల అధికారులమంటూ అమాయకులను భయపెట్టి, నమ్మించి బురిడీ కొట్టిస్తున్నారు. తమ ఖాతాల్లోకి భారీగా నగదును బదిలీ చేసేసుకుంటున్నారని వివిధ కేసుల్లో దర్యాప్తు అధికారులు చెప్తున్నారు. కాగా, గత 4 నెలల్లో 3.25 లక్షల బ్యాంక్ ఖాతాలను స్తంభింపజేసిన అధికారులు.. మరో 5.3 లక్షల సిమ్ కార్డులను బ్లాక్ చేశారు. 3,401 సోషల్ మీడియా అకౌంట్లనూ డీఆక్టివేట్ చేశారు. ఆగ్నేయాసియా దేశాల్లోని వివిధ ప్రాంతాలను కేంద్రంగా చేసుకొని భారత్‌ను సైబర్ మోసగాళ్లు లక్ష్యంగా చేసుకుంటున్నారని 14సీ సీఈవో రాజేశ్ కుమార్ తెలిపారు. వీటిలో కంబోడియా, థాయిలాండ్, మయన్మార్ దేశాలున్నట్టు చెప్పారు.

రిటైల్లోకి అపర్ణ

284 కోట్లతో హైదరాబాద్‌లో షాపింగ్ మాల్

హైదరాబాద్, మే 27: ప్రముఖ రియల్టీ సంస్థ అపర్ణ కన్‌స్ట్రక్షన్స్ అండ్ ఎస్టేట్స్ ప్రైవేట్ లిమిటెడ్..తాజాగా రిటైల్-కమర్షియల్, ఎంటర్‌టైన్‌మెంట్ రంగంలోకి అడుగుపెట్టింది. ఇందు కోసం రూ.284 కోట్లతో హైదరాబాద్‌లో అపర్ణ నియో షాపింగ్ మాల్, అపర్ణ సినిమాస్ పేర్లతో ప్రత్యేక వ్యాపారాన్ని ఆరంభించింది. నల్లగండ్ల వద్ద 3.67 ఎకరాల స్థలంలో 3.5 లక్షల చదరపు అడుగుల విస్తీర్ణంలో షాపింగ్ మాల్‌ను నెలకొల్పింది. వీటిలో రూ.252 కోట్లను అపర్ణ నియో షాపింగ్ మాల్ కోసం ఖర్చు చేసిన సంస్థ..మరో రూ.32 కోట్లతో అపర్ణ సినిమాస్‌ను తీర్చిదిద్దింది. అలాగే వ్యాపార విస్తరణలో భాగంగా 2027 నాటికి తెలంగాణతోపాటు ఆంధ్రప్రదేశ్‌లలో నాలుగు మాల్స్‌ను నెలకొల్పనున్నట్లు ప్రకటించింది. ప్రస్తుతం సంస్థ తెలంగాణతో పాటు ఏపీ, కర్ణాటకల్లో 77 ప్రాజెక్టులను నిర్మించింది. వీటిలో 66 రెసిడెన్షియల్ ప్రాపర్టీలు కాగా, మరో 11 కమర్షియల్ అండ్ రిటైల్ రంగానికి చెందినవి.

సెన్సెక్స్ @ 76,000

- ఇంట్రా-డేలో తొలిసారి తాకిన సూచీ
- నిఫ్టీ సైతం ఆల్‌టైమ్ హైని చేరి దిగువకు పతనం
- స్వల్ప నష్టాల్లో దేశీయ స్టాక్ మార్కెట్లు
- లాభాల స్వీకరణకు దిగిన మదుపరులు

ముంబై, మే 27: తీవ్ర ఒడిదొడుకుల నడుమ దేశీయ స్టాక్ మార్కెట్లు సోమవారం స్వల్ప నష్టాలను చవిచూశాయి. ఉదయం ఆరంభం నుంచే లాభాల్లో పరుగులు పెట్టిన సూచీలు.. మునుపెన్నడూ లేనివిధంగా రికార్డు స్థాయిలను చేరాయి. ఈ క్రమంలోనే బాంబే స్టాక్ ఎక్స్ఛేంజ్ (బీఎస్ఈ) ప్రధాన సూచీ సెన్సెక్స్ తొలిసారి 76,000 పాయింట్లను తాకింది. ఒకానొక దశలో 599.29 పాయింట్లు ఎగిసి గరిష్ఠంగా 76,009.68 వద్దకు వెళ్లి ఆల్‌టైమ్ ఇంట్రా-డే హైని నెలకొల్పింది. ఇదే సమయంలో నేషనల్ స్టాక్ ఎక్స్ఛేంజ్ (ఎన్ఎస్ఈ) సూచీ నిఫ్టీ సైతం 153.70 పాయింట్లు ఎగబాకి 23,000 మార్కును మరోసారి అధిగమించి, మొదటిసారి 23,110.80 స్థాయిని టచ్ చేసింది. అయితే మదుపరులు ఒక్కసారిగా లాభాల స్వీకరణకు దిగారు. దీంతో సూచీలు క్రమేణా పడిపోతూ నష్టాలకు లోనయ్యాయి. చివరకు సెన్సెక్స్ 19.89 పాయింట్లు తగ్గి 75,390.50 వద్ద, నిఫ్టీ 24.65 పాయింట్లు దిగి 22,932.45 వద్ద స్థిరపడ్డాయి. ఇక సెన్సెక్స్ గరిష్ఠ స్థాయి నుంచి దాదాపు 835 పాయింట్లు క్షీణించగా, నిఫ్టీ 250 పాయింట్లు పతనమైంది. సెన్సెక్స్ కనిష్ఠ స్థాయి 75,175.27గా, నిఫ్టీ కనిష్ఠం 22,870గా ఉన్నది. కాగా, సెన్సెక్స్ తొలిసారి 75,000 మార్కును గత నెల ఏప్రిల్ 9న తాకింది. దీంతో గడిచిన 31 ట్రేడింగ్ రోజుల్లో 1,000 పాయింట్లు పెరిగినట్టైంది. అంతకుముందైతే 74,000 నుంచి 75,000 స్థాయికి 21 ట్రేడింగ్ సెషన్లే పట్టింది. ఇదిలావుంటే బ్యాంకింగ్, ఫైనాన్షియల్, ఐటీ, ఆయిల్, ఎనర్జీ, ఎఫ్ఎంసీజీ షేర్లు అమ్మకాల ఒత్తిడికి లోనయ్యాయి. మార్కెట్ హెవీ వెయిట్ షేరైన రిలయన్స్ ఇండస్ట్రీస్ లిమిటెడ్ షేర్ విలువ దాదాపు 1 శాతం తగ్గడం ఓవరాల్ ట్రేడింగ్ సెంటిమెంట్‌ను ప్రభావితం చేసినట్టు మెజారిటీ నిపుణులు విశ్లేషిస్తున్నారు. ఐటీసీ షేర్ల పతనం కూడా దెబ్బతీసింది. ఇక వచ్చే వారం (జూన్ 4న) లోక్‌సభ ఎన్నికల ఫలితాలు ఉండటంతో మదుపరులు ఒకింత భయాందోళనలకు గురవుతున్నారని, ఇందుకు మార్కెట్ ఒడిదొడుకులే తాజా ఉదాహరణ అని మరికొందరు ఎక్స్‌పర్ట్స్ ట్రేడింగ్ సరళిని అభివర్ణిస్తున్నారు. సెన్సెక్స్‌లో విప్రో, ఎన్టీపీసీ, సన్ ఫార్మా, మహీంద్రా అండ్ మహీంద్రా, ఐటీసీ, ఆర్ఐఎల్ షేర్లు భారీగా నష్టపోయాయి. బీఎస్ఈ మిడ్, స్మాల్ క్యాప్ సూచీలూ 0.63 శాతం, 0.09 శాతం చొప్పున క్షీణించాయి.

తగ్గనున్న ఎన్ఎస్ఈ టిక్ సైజ్

రూ.250 కంటే తక్కువ ధర కలిగిన అన్ని స్టాక్స్‌కు ఒక పైసా టిక్ సైజ్‌ను పెట్టాలని ఎన్ఎస్ఈ నిర్ణయించింది. జూన్ 10 నుంచి ఈ మార్పు అమల్లోకి రానున్నది. ఇంతకుముందు ఇది 5 పైసలుగా ఉండేది. ద్రవ్యతను పెంచడం, ధర అన్వేషణను మెరుగుపర్చడంలో భాగంగానే ఆయా షేర్లకు టిక్ సైజ్‌ను తగ్గిస్తున్నట్టు ఎన్ఎస్ఈ ఓ సర్క్యులర్‌లో పేర్కొన్నది. టిక్ సైజ్‌లు అనేవి ప్రతీ నెల చేసే సర్దుబాట్లు, సమీక్షలకు లోబడి ఉంటాయి. ప్రతీ నెల చివరి ట్రేడింగ్ రోజు ముగింపు ధరలపై ఆధారపడి ఉంటాయి. గత ఏడాది బీఎస్ఈ కూడా రూ.100 కంటే తక్కువ ధర కలిగిన అన్ని స్టాక్స్‌కు టిక్ సైజ్‌ను 5 పైసల నుంచి 1 పైసాకు తగ్గించింది.

ఎన్ఎండీసీ ప్రాఫిట్ డౌన్

న్యూఢిల్లీ, మే 27: ఖనిజ ఉత్పత్తిలో అగ్రగామి సంస్థయైన ఎన్ఎండీసీ నిరాశాజనక ఆర్థిక ఫలితాలు ప్రకటించింది. మార్చి త్రైమాసికానికిగాను రూ.1,415.62 కోట్ల నికర లాభాన్ని గడించింది. 2022-23 ఆర్థిక సంవత్సరం ఇదే సమయంలో నమోదైన రూ.2,276.94 కోట్ల లాభంతో పోలిస్తే 38 శాతం తగ్గింది. సమీక్షకాలంలో కంపెనీ ఆదాయం రూ.5,842.52 కోట్ల నుంచి రూ. 6,908.37 కోట్లకు